24-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "అవ్యక్త బాప్ దాదా" రివైజ్ 13-03-98 మధువనం

"హోలీ అనే పదము యొక్క అర్థ స్వరూపములో స్థితులవ్వటము అనగా బాబా సమానంగా అవ్వటము"

ఈ రోజు బాప్ దాదా తమ హోలియెస్ట్ (అతి పవిత్రులైన), హైయ్యెస్ట్ (అతి ఉన్నతులైన) మరియు రిచెస్ట్ ఇన్ ది వరల్డ్ (ప్రపంచములో అతి ధనవంతులైన) పిల్లలను నలువైపులా చూస్తున్నారు. సాకారంలో సమ్ముఖంగా ఉన్నా, లేక దూరంగా ఉంటూ మనసుతో సమీపంగా ఉన్నా... నలువైపులా ఉన్న పిల్లలను చూసి హర్షిస్తూ ఉంటారు. పిల్లలు ప్రతి ఒక్కరూ ఎంత హోలియెస్ట్ గా అవుతారంటే మొత్తము కల్పములో మరెవ్వరూ ఇంతటి మహాన్ పవిత్ర ఆత్మలుగా అవ్వలేదు, అవ్వలేరు కూడా. ఎప్పటికప్పుడు ధర్మాత్మలు, మహానాత్మలు పవిత్రంగా ఉన్నారు, కానీ వారి పవిత్రతకు మరియు మీ పవిత్రతకు తేడా ఉంది. ఈ సమయంలో మీరు పవిత్రంగా అవుతారు, ఈ పవిత్రత యొక్క ప్రాప్తి మరియు ప్రారబ్ధముగా భవిష్యత్తులో అనేక జన్మల వరకు తనువు, మనను, ధనము, సంబంధ-సంపర్కాలు మరియు వాటితో పాటుగా ఆత్మ, అన్నీ పవిత్రంగా ఉంటాయి. శరీరము కూడా పవిత్రంగా ఉంటుంది మరియు ఆత్మ కూడా పవిత్రంగా ఉంటుంది - ఇటువంటి పవిత్రతను ఆత్మలైన మీరు ప్రాప్తి చేసుకుంటారు. మనస్సు-మాట-కర్మ, ఈ మూడు పవిత్రంగా అవ్వటం ద్వారా ఇటువంటి ప్రారబ్ధము ప్రాప్తిస్తుంది. కనుక మీరు ఇటువంటి హోలియెస్ట్ (అతి పవిత్రులైన) ఆత్మలు. మిమ్మల్ని మీరు ఇటువంటి శ్రేష్ఠ హోలియెస్ట్ ఆత్మలుగా భావిస్తున్నారా? ఇప్పుడు అలా తయారయ్యారా లేక అవుతూ ఉన్నారా? అలా తయారవ్వటము సహజమా లేక కొంచెం-కొంచెం కష్టమా? కానీ కల్పపూర్వము కూడా అలా తయారయ్యారు మరియు ఇప్పుడు కూడా తయారవ్వాల్సిందే. పక్కానా లేక కొంచెం-కొంచెం ఉంటుందా? అలా కాదు. స్వప్నమాత్రము కూడా అపవిత్రత సమాప్తమవ్వాల్సిందే. ఈ రోజు తయారవుతూ ఉన్నాము మరియు రేపటికి తప్పకుండా తయారైపోతాము అన్న ఇంతటి నిశ్చయము ఉంది కదా. మీరు హోలియెస్ట్ (అతి పవిత్రులు) కూడా, అలాగే హైయ్యెస్ట్ (అతి ఉన్నతులు) కూడా.

ఉన్నతోన్నతుడైన తండ్రి పిల్లలు ఉన్నతోన్నతులు. హైయ్యెస్ట్ గా అవుతారు కనుకనే పూజింపబడతారు. ఈ రోజుల్లోని ఉన్నత ఆత్మలైనా, ఫలితాన్ని ఆశించి రాజ్యం చేసే రాజులైనా, ఇప్పుడు అటువంటివారు లేరనుకోండి, ప్రెసిడెంట్ అయినా, ప్రైమ్ మినిస్టర్ అయినా, వారు పూజ్యులుగానైతే అవ్వరు. పూజ్యులుగా అయ్యే ఆత్మలైన మీ ముందు పూజారులుగా అయ్యి నమస్కరిస్తారు మరియు పూజిస్తారు. ఇప్పుడు కూడా స్వరాజ్య అధికారులుగా అవుతారు మరియు భవిష్యత్తులో కూడా రాజులకే రాజులుగా అవుతారు. కనుక అటువంటి హైయ్యెస్ట్ (అతి ఉన్నత) పదవిని ప్రాప్తి చేసుకుంటారు. దానితో పాటుగా మీరు రిచెస్ట్ ఇన్ ది వరల్డ్ (ప్రపంచములోని అతి ధనవంతులు). మీ టైటిల్ యే పదమాపదంపతి అని ఉంది. మరియు మీ వద్ద ఎటువంటి ఖజానా ఉందంటే దానిని కోటీశ్వరులు, కోటానుకోట్ల కోటీశ్వరులు కూడా వారి కోటాను కోట్లతో ఇటువంటి ఖజానాను ప్రాప్తి చేసుకోలేరు. శ్రేష్ఠ ఆత్మలైన మీరు బాబా ద్వారా ఎటువంటి భాగ్యాన్ని తయారు చేసుకుంటున్నారంటే - మా అడుగులో పదమాలు ఉన్నాయి అని మీరు అనుభవము చేస్తారు మరియు వర్ణన కూడా చేస్తారు. అడుగులో పదమాలు ఉన్నాయా లేక వందలు ఉన్నాయా, వేలు ఉన్నాయా? అత్యంత పెద్ద మిలియనియర్ కూడా ఇంత సంపాదనను చేసుకోలేరు. అడుగు వెయ్యటానికి ఎంత సమయము పడుతుంది? అడుగు వెయ్యండి, ఎంత సమయము పడుతుంది? ఒక్క క్షణము. పోనీ రెండు క్షణాలు అనుకోండి. ఒకవేళ రెండు క్షణాలు అని అన్నా కానీ రెండు క్షణాలలో పదమాలు అంటే, మరి మొత్తము రోజంతటిలో ఎన్ని పదమాలు అయ్యాయి? లెక్క పెట్టండి. ఒక్క రోజులో ఇంతటి సంపాదనను చేసుకునే మిలియనియర్ ఎవరైనా ఉన్నారా? ఇలా ఎవరైనా ఉంటారా? కనుక మీరు రిచెస్ట్ ఇన్ ది వరల్డ్ కదా! మరియు మీది ఎటువంటి ఖజానా అంటే దానిని నిప్పు కూడా కాల్చలేదు, నీరు ముంచెయ్యలేదు, దొంగలు దోచుకోలేరు, రాజులు కూడా తినలేరు. ఇటువంటి ఖజానాను ఈ పురుషోత్తమ సంగమయుగములో ప్రాప్తి చేసుకుంటారు. మరి ఇటువంటి మీ స్వమానము స్మృతిలో ఉంటుందా? ఉంటుందా, ఉండటం లేదా? వెనుక ఉన్నవారు చేతులూపుతున్నారు. వెనుక ఉన్నవారు ప్రశాంతంగా కూర్చుని ఉన్నారు కదా? రిచెస్ట్ ఇన్ ది వరల్డ్ కనుక ప్రశాంతతే ప్రశాంతత. అత్యంత పెద్ద యూనివర్సిటీలలో కూడా చదువు చదువుకునేందుకు ఇటువంటి సోఫాలలో కూర్చోరు, కానీ మీరు బెగ్గర్ టు ప్రిన్స్ (బికారి నుండి యువరాజు) గా అయ్యేవారు. మీరు బికారి కూడా, అలాగే యువరాజు కూడా. సర్వస్వ త్యాగము అనగా బికారి. సర్వ ప్రాప్తులు అనగా యువరాజు. త్యాగము లేకుండా ఇంత పెద్ద భాగ్యము లభించదు. త్యాగానికే భాగ్యము లభించింది.

తనువు-మనను-ధనము, సంబంధాలు అన్నింటినీ త్యాగము చేసారు అనగా పరివర్తన చేసారు. తనువును నాదికి బదులుగా నీదిగా చేసారు. మనసు, ధనము, సంబంధాలను ఒక్క పదాన్ని పరివర్తన చెయ్యటం ద్వారా నావి అన్నదానికి బదులుగా నీవిగా చేసారు, వాస్తవానికి అది ఒకే పదము యొక్క పరివర్తన, కానీ ఈ త్యాగము ద్వారానే భాగ్యానికి అధికారులుగా అయ్యారు. కనుక భాగ్యం ముందు ఈ త్యాగం ఎంత? చిన్న విషయమా లేక కొంచెం పెద్దది కూడానా? అప్పుడప్పుడు పెద్దదైపోతుంది. నీది అని అనటమంటే పెద్ద విషయాన్ని చిన్నదిగా చెయ్యటము మరియు నాది అని అనటమంటే చిన్న విషయాన్ని పెద్దదిగా చెయ్యటము. ఏం జరిగినా సరే, 100 హిమాలయ పర్వతాల కంటే కూడా పెద్ద సమస్య వచ్చినా కానీ, నీది అని అనటమంటే పర్వతాన్ని దూదిలా చెయ్యటము, ఆవగింజ అంత కూడా కాదు, దూది అంత. సమస్య దూదిలా క్షణంలో ఎగిరిపోవాలి. కేవలము నీది అని అనటం కాదు, దానిని స్వీకరించాలి, స్వీకరించటమే కాదు, దాని అనుసారంగా నడవాలి. ఒక్క పదాన్ని పరివర్తన చెయ్యటము సహజమే కదా! మరియు అందులో లాభమే ఉంది, నష్టమైతే లేదు. నీది అని అనటం ద్వారా మొత్తము భారమంతటినీ బాబాకు ఇచ్చేసినట్లు. నీది నీకే తెలుసు. మీరు కేవలము నిమిత్తమాత్రులు. ఇందులో లాభమే ఉంది కదా? అతీతులుగా మరియు పరమాత్మునికి ప్రియులుగా అయిపోయారు. ఎవరైతే పరమాత్మునికి ప్రియులుగా అవుతారో, వారు విశ్వానికి ప్రియులుగా అవుతారు. ఇందులో కేవలం భవిష్య ప్రాప్తియే కాదు, వర్తమానములో కూడా ప్రాప్తి ఉంటుంది. ఒక్క క్షణంలో అనుభవం చేసారు కూడా మరియు ఇంకా చేసి చూడండి. ఏ విషయం వచ్చినా సరే, నీది అని అనండి, స్వీకరించండి మరియు నీదిగా భావించి చెయ్యండి, అప్పుడు చూడండి, భారము తేలికవుతుందో, లేదో. అనుభవం ఉంది కదా? అందరూ అనుభవీలే కూర్చుని ఉన్నారు కదా! వాస్తవానికి ఏం జరుగుతుందంటే, నాది నాది అని అనటం చాలా అలవాటైపోయింది కదా, 63 జన్మల అలవాటు, కనుక నీది నీది అని అంటూ మరల నాది అని అనేస్తారు, మరియు నాది అని అన్నారంటే పోయినట్లే, తర్వాత ఆ విషయము ఒక గంటలో, రెండు గంటలలో, ఒక రోజులో సమాప్తమైపోతుంది, కానీ నీది నుండి నాది అని ఏదైతే అన్నారో దాని ఫలితం మాత్రం చాలాకాలం ఉంటుంది. విషయం అరగంటదే ఉంటుంది, కానీ పశ్చాత్తాప రూపంలోనైనా లేక పరివర్తన చేసుకునే లక్ష్యంతోనైనా, ఆ విషయము పదే-పదే స్మృతిలోకి వస్తూ ఉంటుంది, అందుకే బాబా పిల్లలందరికీ చెప్తున్నారు - ఒకవేళ 'నాది' అనే పదం పట్ల ప్రేమ ఉన్నట్లయితే, అది అలవాటైపోయింది, సంస్కారమైపోయింది అంటే, ఆ పదాన్ని ఉపయోగించాల్సిందే అని అంటే, 'నా బాబా' అని అనండి. అలవాటుకు వశమైపోతారు కదా. కనుక ఎప్పుడెప్పుడు నాది-నాది అనేది వచ్చినా, 'నా బాబా' అని అంటూ దానిని సమాప్తము చేసేసెయ్యండి. అనేక 'నాది' అనేవాటిని ఒక్క 'నా బాబా'లో కలిపెయ్యండి.

రష్యావారు ఒక బొమ్మను తీసుకొస్తారు కదా, బొమ్మలో బొమ్మ... ఉంటూ ఒకే బొమ్మగా అయిపోతుంది. అలా మీరు కూడా ఒక్క 'నా బాబా'లో అనేక 'నావి' అనేవాటిని కలిపేయండి, సమాప్తము. ఇలా చెయ్యగలరా? చేస్తారు కానీ అప్పుడప్పుడు నాది అనేదాని విస్తారములోకి వెళ్ళిపోతారు. ఇప్పుడు ఒక్కోసారి 'నీది' అని అంటారు, కానీ సదా 'నాది' అనేది 'నీది'గా అయిపోవటంలో నంబరువారుగా ఉన్నారు. నంబరు వన్ గా ఉన్నవారు కూడా ఉన్నారు, ఏ వన్ గా ఉన్నవారు కూడా ఉన్నారు, కానీ వెనుక నంబర్ వారు కూడా ఉన్నారు. హోలీని జరుపుకోవటానికి వచ్చారు కదా? కనుక ఈ మంత్రమునే గుర్తు ఉంచుకోండి - నేను బాబాకు హోలీ (బాబా వానిగా అయిపోయాను), పరమాత్ముని పరివారానికి చెందినవానిగా అయిపోయాను. మరి ఇటువంటి హోలీని జరుపుకున్నారా? ఇప్పుడు ఏం చెయ్యాలి? ఇప్పుడు ఇంకా కాల్చాలా లేక కాల్చేసారా? ఇందులో కాల్చేసాము అని అనటం లేదు, ఆలోచిస్తున్నారా?

చూడండి, భక్తి మార్గంలో ఏయే ఉత్సవాలనైతే జరుపుతారో, అవి స్మృతిచిహ్నాలు, కానీ అవి కూడా కొంత అర్థసహితంగా తయారుచేయబడ్డాయి. హోలీ పండుగలో ముందు కాల్చాలి, ఆ తరువాత జరుపుకోవాలి. ముందు జరుపుకోవటము, ఆ తరువాత కాల్చటము కాదు. ముందు భస్మము చెయ్యండి, అశుద్ధాన్ని, బలహీనతను, చెడును కాల్చేయండి, ఆ తరువాత జరుపుకోండి. మీరైతే చాలా ముందుగానే కాల్చేసారు కదా లేక ఇప్పుడు కూడా కండువా అంచులు ఏవైనా మిగిలిపోయి ఉన్నాయా? పాండవుల బుష్ షర్టు (వదులుగా ఉండే పొడవాటి కాటన్ చొక్కా) లేక మీరు వేసుకునే డ్రస్సులో మూలలేమైనా మిగిలిపోయి ఉన్నాయా? చీర అంచులైతే మిగిలిపోలేదు కదా? వాస్తవానికి చూడండి, ఆత్మికంగా జరుపుకోవాలి మరియు అలా జరుపుకోవటం ద్వారా శక్తిని, అతీంద్రియ సుఖాన్ని అనుభవము చెయ్యటమనేది ఎప్పుడు చెయ్యగలరంటే, ముందుగా కాల్చేసినప్పుడే. మనోరంజనం రూపంలో జరుపుకోవటమనేది వేరే విషయము. అలా చూస్తే సంగమయుగము ఉన్నదే ఆనందాల యుగము, అందుకే మనోరంజనం రీతిలో కూడా జరుపుకుంటారు మరియు జరుపుకోండి కూడా, బాగా జరుపుకోండి. కానీ పరమాత్ముని రంగులో రంగరించబడటము అనగా బాబా సమానంగా అవ్వటము. ఇది వారి రంగులో రంగరించబడటము అంటే (వారి ప్రభావము తమపై

పడటము). ఏ విధంగా బాబా అశరీరులో, అవ్యక్తులో, అలా అశరీరీతనమును అనుభవము చెయ్యటము మరియు అవ్యక్త ఫరిశ్తాతనమును అనుభవము చెయ్యటము - ఇదే రంగులో రంగరించబడటము అంటే. కర్మలు చెయ్యండి కానీ అవ్యక్త ఫరిశ్తాలుగా అయ్యి పని చెయ్యండి. అశరీరీతనపు స్థితిని ఎప్పుడు కావాలంటే అప్పుడు అనుభవము చెయ్యండి. ఇలా మనసు మరియు బుద్ధి మీ కంట్రోల్ లో ఉండాలి. అశరీరిగా అవ్వు అని ఆజ్ఞాపించండి. ఆజ్ఞాపించగానే జరిగిపోవాలి, ఫరిశ్తాగా అయిపోవాలి. మనసును ఎక్కడ ఏ స్థితిలో స్థితి చేసుకోవాలనుకుంటే అక్కడ క్షణంలో స్థితులైపోండి. ఎక్కువ సమయం పట్టలేదు కానీ, 5 క్షణాలే పట్టాయి, 2 క్షణాలే పట్టాయి అని అనుకోకూడదు. అలా జరిగితే ఆర్డర్ లోనైతే లేనట్లే, కంట్రోల్ లో అయితే లేనట్లే. ఎటువంటి పరిస్థితి అయినా, అలజడి ఉన్నా, అలజడిలో కూడా అచలంగా అవ్వండి. అటువంటి కంట్రోలింగ్ పవర్ ఉందా? లేక అశరీరిగా అవ్వాలి, అశరీరిగా అవ్వాలి... అని ఆలోచిస్తూ-ఆలోచిస్తూ ఇలా ఆలోచించటంలోనే సమయము గడిచిపోతుందా? కొంతమంది పిల్లలు చాలా రకరకాల పోజులను మారుస్తూ ఉంటారు, బాబా చూస్తూ ఉంటారు. అశరీరిగా అవ్వాలి అని అనుకుంటారు, మళ్ళీ ఇలా ఆలోచిస్తారు - అశరీరి అనగా ఆత్మ రూపములో స్థితులవ్వటము, అవును, నేను ఉన్నదే ఆత్మగా, శరీరమునైతే కానే కాదు, నేను ఆత్మనే, నేను వచ్చిందే ఆత్మగా, అవ్వాల్సింది కూడా ఆత్మగా... ఇప్పుడు ఇటువంటి ఆలోచనలతో అశరీరిగా అయ్యారా లేక అశరీరిగా అయ్యేందుకు యుద్ధము చేసారా? మీ మనసుకు - క్షణంలో అశరీరిగా అవ్వు అని ఆజ్ఞాపించారేగానీ, అశరీరి అంటే ఏమిటి, ఎప్పుడు అశరీరిగా అవుతారు, ఏ విధంగా అవుతారు అని ఆలోచించమనైతే చెప్పలేదు కదా? మరి ఆజ్ఞను అంగీకరించలేదనే కదా! ఇది కంట్రోలింగ్ పవర్ అయితే కాదు కదా! ఇప్పుడు సమయమనుసారంగా ఇటువంటి అభ్యాసము యొక్క అవసరమే ఉంది. ఒకవేళ కంట్రోలింగ్ పవర్ లేకపోతే ఎన్నో పరిస్థితులు అలజడిలోకి తీసుకురాగలవు, అందుకే ఒక్క హోలీ అన్న పదాన్నే గుర్తు చేసుకున్నా సరే సరిపోతుంది. హోలీ - జరిగిపోయిందేదో జరిగిపోయింది మరియు హో లీ అనగా బాబాకు చెందినవారిగా అయిపోయారు. ఇంకా ఎలా అయ్యారు? హోలీగా అనగా పవిత్ర ఆత్మగా అయ్యారు. హోలీ అన్న ఒక్క పదాన్ని గుర్తు చేసుకున్నా సరే, ఆ హోలీ అన్న ఒక్క పదముకు కల మూడు అర్థాలను ఉపయోగించండి. అవును, హోలీ అంటే జరిగిపోయిందేదో జరిగిపోయింది అని వర్ణించకండి. అవును, జరిగిపోయిందేదో జరిగిపోయింది అని ఆలోచిస్తూ ఉండకండి, వర్ణిస్తూ ఉండకండి, అలా కాదు. అర్థ స్వరూపములో స్థితులవ్వండి. ఆలోచించారు మరియు అయిపోయారు అన్నట్లు ఉండాలి. అంతేకానీ ఆలోచిస్తూ ఆలోచనలలోనే ఉండిపోవటం కాదు. అలా కాదు. ఏదైతే ఆలోచించారో, ఆ విధంగా అయిపోయారు, తయారైపోయారు, స్థితులైపోయారు అన్నట్లు ఉండాలి.

(బాప్ దాదా డ్రిల్ చేయించారు)

ఇప్పుడు సమయము అనుసారంగా సదా స్మృతి మరియు సేవలలో ఉండే నిమిత్త ఆత్మలైన మీలోని ప్రతి ఒక్కరూ స్వ పరివర్తన ద్వారా విశ్వ పరివర్తనా వైబ్రేషన్లను శక్తివంతంగా మరియు తీవ్ర వేగంతో పెంచాలి. నలువైపులా మానసిక దుఃఖము మరియు అశాంతి, మానసిక ఆందోళనలు చాలా తీవ్రగతితో పెరుగుతున్నాయి. బాప్ దాదాకు విశ్వాత్మలపై దయ కలుగుతుంది. కనుక ఎంత తీవ్రగతితోనైతే దుఃఖపు అల పెరుగుతూ ఉందో, అంతగానే సుఖదాత పిల్లలైన మీరు మీ మనసా శక్తితో, మనసా సేవ మరియు సకాష్ సేవతో, వృత్తితో నలువైపులా సుఖము యొక్క దోసిలిని అనుభవము చేయించండి. బాబానైతే పిలుస్తూనే ఉంటారు కానీ పూజ్య దేవాత్మలైన మిమ్మల్ని కూడా ఏదో ఒక రూపంలో పిలుస్తూ ఉంటారు. కనుక ఓ దేవాత్మలారా, పూజ్యాత్మలారా, మీ భక్త ఆత్మలకు సకాష్ ను ఇవ్వండి. సైన్స్ వారు కూడా - దుఃఖం సమాప్తి అయ్యే ఆవిష్కరణలను ఆవిష్కరించాలి అని అనుకుంటారు. విజ్ఞాన సాధనాలు సుఖంతోపాటు దుఃఖాన్ని కూడా ఇస్తాయి. కానీ దుఃఖం ఉండకుండా కేవలం సుఖమే ప్రాప్తించాలి అని కూడా తప్పకుండా ఆలోచిస్తారు. కానీ స్వయంలోనే అనగా ఆత్మలోనే అవినాశీ సుఖం యొక్క అనుభవం లేకపోతే ఇతరులకు ఎలా ఇవ్వగలరు? కానీ మీ అందరి వద్ద సుఖము, శాంతి మరియు నిస్వార్థమైన సత్యమైన ప్రేమ యొక్క స్టాక్ జమ అయి ఉంది. జమ అయి ఉందా లేక ఎంతైతే కూడబెడతారో అంతా ఖర్చు అయిపోతుందా? ఇది కూడా చెక్ చేసుకోండి - జమ అయితే అవుతుంది, కానీ జమతో పాటుగా ఖర్చు కూడా అవ్వటం లేదు కదా? జ్ఞాన ఖజానా అయితే ఖర్చు చేసే కొద్దీ పెరుగుతుంది, తక్కువ అవ్వదు. ఒకవేళ పదే-పదే తమ స్వభావ-సంస్కారాల విషయంలోనో లేక మాయ వైపు నుండి వచ్చే సమస్యలలోనో తమ శక్తులను ఉపయోగించినట్లయితే జమ ఖాతా తగ్గిపోతుంది. కనుక చెక్ చేసుకోండి - జమ చేసుకున్నారు కానీ ఖర్చు కూడా చేస్తుంటే అకౌంట్ లో ఎంత మిగిలి ఉంది? సంపాదించారు మరియు తినేసారు, ఇలా అయితే లేదు కదా? రెండు రోజులు సంపాదించుకున్నారు మరియు ఒక్క రోజులో జమ చేసుకున్నది కూడా ఖర్చు చేయవలసి వచ్చేలా అంతగా పోగొట్టుకున్నారు అనేటువంటి అకౌంట్ అయితే లేదు కదా? ఒకవేళ ఇలానే

సంపాదించారు మరియు తినేసారు లేక స్వయం కొరకే ఖర్చు చేసుకుని సమాప్తం చేసారు అంటే ఇక 21 జన్మలకు ఏం జమ చేసుకున్నట్లు? జమ చేసుకుంటే సంతోషము కలుగుతుంది కానీ ఖర్చు అయినదాని లెక్కను చూసుకోకపోతే సమయానికి మోసపోతారు. జమ ఖాతాను కూడా చూసుకోండి, దానితో పాటు స్వయం కొరకు ఎంత ఖర్చు చేసాను అన్నదానిని కూడా చూసుకోండి. ఇతరులకు ఏదైనా గుణాన్ని ఇచ్చారు, శక్తిని ఇచ్చారు, జ్ఞాన ఖజానాను ఇచ్చారు, అది ఖర్చు కాదు, అది జమ ఖాతాలోనే జమ అవుతుంది కానీ స్వయము కొరకే ఎప్పటికప్పుడు ఖర్చు చేసినట్లయితే ఖాతా ఖాళీ అయిపోతుంది. అందుకే మంచి విశాల బుద్ధితో చెకింగ్ చేసుకోండి. జమ ఖాతా చాలా ఎక్కువ ఉండాలి. వాస్తవానికి ఇది సహజమే. ఒకవేళ ప్రతి అడుగులో పదమాలు జమ చేసుకుంటూ వెళ్ళినట్లయితే జమ అకౌంట్ చాలా ఎక్కువవుతుంది. కనుక చెక్ చేసుకోండి - ప్రతి కర్మ లేక ప్రతి అడుగు బ్రహ్మాబాబా సమానంగా ఉందా? మీరు అనుభవజ్ఞులు. ఎప్పుడైనా ఏదైనా మంచి కర్మ చేసినట్లయితే ఆ కర్మ ఫలంగా ఆ సమయములోనే ప్రత్యక్ష రూపంలో లభించే సంతోషము, శక్తి మరియు సఫలతల కారణంగా డబుల్ లైట్ గా ఉంటారు ఎందుకంటే బాబా తోడుతో కర్మ చేసాము అన్నది గుర్తుంటుంది. మరియు ఒకవేళ ఇప్పుడు ఏదైనా వికర్మ జరిగినట్లయితే దాని వలన కలిగే పశ్చాత్తాపము చాలా ఎక్కువ ఉంటుంది. ఆ మాటకొస్తే ఇప్పుడు వికర్మలేమీ జరగకూడదు, ఆ సమయం ఇప్పుడు గడిచిపోయింది. ఇప్పుడు ఎటువంటి వ్యర్థ సంకల్పాలు మరియు వ్యర్థ కర్మలు, వ్యర్థ మాటలు, వ్యర్థ సంబంధ-సంపర్కాలు కూడా ఉండకూడదు ఎందుకంటే వ్యర్థ సంబంధ-సంపర్కాలు కూడా చాలా మోసం చేస్తాయి. ఎటువంటి సాంగత్యమో అటువంటి రంగు అంటుకుంటుంది. కొంతమంది పిల్లలు చాలా తెలివైనవారు, వారేమంటారంటే - మేము వారితో సాంగత్యము చెయ్యము, కానీ వారు నన్ను వదలటం లేదు, నేను చెయ్యను కానీ వారు వదలటం లేదు. మరి అటువంటప్పుడు పక్కకు తప్పుకోవటం రాదా? ఒకవేళ ఎవరైనా ఏదైనా చెడిపోయిన వస్తువును ఇస్తే మీరు ఎందుకు తీసుకుంటారు! తీసుకునేవారు తీసుకోకపోతే ఇచ్చేవారు ఏం చేస్తారు? వ్యర్థ సంబంధాలు మరియు సంపర్కాలు కూడా అకౌంట్ ను ఖాళీ చేసేస్తాయి. అంతేకాక ఆ సమయంలో - ఇది చెయ్యకూడదు అని మనసులో అనిపిస్తుంది కూడా, మనసు తింటుంది. చెయ్యకూడదు, అయినా కానీ చేసేస్తారు. వినకూడదు కానీ వినిపిస్తుంటే నేనేం చెయ్యను! అని అంటారు. కానీ ఒకవేళ మీరు పురుషార్థులైతే వ్యర్థ కర్మ కూడా జరగకూడదు. ఒకవేళ మీరు నిర్లక్ష్యులైతే ఇక ఆ విషయాన్నే వదిలేయండి, హాయిగా నిద్రపోండి, త్రేతాయుగములో రండి. కానీ ఒకవేళ మీరు పురుషార్థులైతే - ఇది చెయ్యకూడదు అని ఆ సమయములో మనసులోకి వస్తుంది, మనసు తింటుంది, అయినా కూడా చేస్తుంటే బాప్ దాదా అంటారు - ఇటువంటి పిల్లలది విచిత్రము, వద్దనుకున్నా కూడా చేస్తుంటారు, మనసు తింటూ ఉంటుంది కానీ వింటూ కూడా ఉంటారు, చేస్తూ కూడా ఉంటారు, అంటే చాలా శక్తిశాలీ ఆత్మలు కదా! అందుకే వ్యర్థం విషయంలో కూడా చెకింగ్ ను అటెన్షన్ తో చేసుకోండి. అచ్ఛా!

నలువైపులా ఉన్న హోలియెస్ట్ ఆత్మలకు, సదా హైయ్యెస్ట్ స్థితిలో స్థితులై ఉండే హైయ్యెస్ట్ ఆత్మలకు, సదా సర్వ ఖజానాలతో సంపన్నులైన రిచెస్ట్ ఆత్మలకు, సదా ప్రతి అడుగులో పదమాలను జమ చేసుకునేవారికి, బాబా సమానంగా అయ్యే శ్రేష్ఠ ఆత్మలకు, సదా దయార్ద్ర హృదయులకు, క్షమా సాగరుని పిల్లలుగా మాస్టర్ క్షమించే ఆత్మలకు, విశ్వములోని దుఃఖిత ఆత్మలకు సకాష్ ద్వారా సుఖ-శాంతుల దోసిలిని అందించే ఆత్మలకు, ప్రతి సమయము తమ జమ ఖాతాను నిండుగా ఉంచుకునే అతి తీవ్ర పురుషార్థీ ఆత్మలకు బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- హోలీ అనే పదము యొక్క అర్థాన్ని జీవితములోకి తీసుకువచ్చి పురుషార్థపు వేగాన్ని తీవ్రతరం చేసే తీవ్ర పురుషార్థీ భవ

హో లీ అనగా ఏ విషయమైతే జరిగిపోయిందో, గడిచిపోయిందో దానిని పూర్తిగా సమాప్తము చెయ్యటము. గతం గతః చేసి ముందుకు వెళ్ళటము, ఇదే హోలీని జరుపుకోవటము. గతించిపోయిన విషయము అనేది ఏదో చాలా పాత జన్మలోని విషయములా అనిపించాలి. ఎప్పుడైతే ఇటువంటి స్థితి ఏర్పడుతుందో అప్పుడు పురుషార్థపు వేగము తీవ్రతరం అవుతుంది. కావున స్వయం లేక ఇతరుల యొక్క గతించిపోయిన విషయాలను ఎప్పుడూ చింతనలోకి తీసుకురాకండి, మనస్సులో పెట్టుకోకండి మరియు వాటిని వర్ణన అయితే అసలు ఎప్పుడూ చేయకండి, అప్పుడే తీవ్ర పురుషార్థులుగా అవ్వగలరు.

స్లోగన్:- నాది అన్న అనేక సంబంధాలను సమాప్తము చెయ్యటమే ఫరిశ్తాగా అవ్వటము.